క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.రాజేశ్వర్ వెల్లడించారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలో రవాణా పరమైన సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఆర్టీసీ అభివృద్ధికి దోహదపడే సలహాలను స్వీకరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9000405878కు సమస్యలు, సలహాలు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ ఏఈగా సూర్యం బాధ్యతల స్వీకరణ


సూర్యం

వెల్దండ: మండల విద్యుత్ ఏఈగా సూర్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొల్లాపూర్ సబ్ డివిజన్‌లో సబ్‌ఇంజనీర్ విధులు నిర్వహిస్తున్న ఆయనకు పదోన్నతి రావడంతో విద్యుత్ ఏఈగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు విద్యుత్ ఆదా చేయాలని కోరారు. వృథాగా విద్యుత్ వినియోగించడంతో కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో మూడు నెలల ముందుగా అత్యధికంగా విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు.

శ్మశానవాటిక స్థలం ఆక్రమణపై వాగ్వాదం



కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి విష్ణుకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. కొంతమంది వ్యక్తులు శ్మశాన వాటికలు ఆక్రమించుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సురేష్, బాలస్వామి, శ్రీను, బుచ్చన్నగౌడ్ కోరారు. ఈ విషయంలో కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. కావున అధికారులు స్పందించి ఆక్రమాలకు గురికాకుండ చర్యలు తీసుకోవాలన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

కందనూలు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 20వ తేది వరకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రోజు 15 బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తుల రద్దీ అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచుతామని తెలిపారు.

కొల్లాపూర్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొల్లాపూర్ నుంచి శ్రీశైలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు డీఎం రాజేశ్వర్ వెల్లడించారు.

నూతన కమిటీ ఎంపిక

తాడూరు: కంటి వెలుగు ఆప్తామిలక్ అసోసియేషన్ నూతన కమిటీ సమావేశం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వర్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, రాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేందర్‌తో పాటు భీంలాల్ నాయక్, రాజేశ్, రాంలక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పేద ప్రజలకు ఉపయోగపడేలా అంధత్వ నివారణ లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు నాయకులు సురేశ్, షాహీన్, అవంతి, హేమలత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మన్ననూర్‌కు 5 కిలో మీటర్ల దూరంలో అటవీ సమీప ప్రాంతంలో ఆటో బైక్ ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో బైకు పై వెళ్తున్న ఇబ్రహీంపట్నంకు చెందిన నాగరాజుకు గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ సహాయంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ పరీక్ష చేసిన వైద్య సిబ్బంది ప్రాణాపాయ పరిస్థితి లేదన్నారు. ఆటో నడుపుతున్న శ్రీశైలంకు చెందిన సదాశివకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని అమ్రాబాద్, ఈగలపెంట పోలీసులు తెలిపారు.

విచారణ చేస్తాం..

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని అనారోగ్యానికి గురైన సంఘటనపై సమగ్ర విచారణ జరుపుతామని ఎంఈఓ బాసనాయక్ గురువారం విలేకరులకు చెప్పారు. ఆస్పత్రి నుంచి విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారని అన్నారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించిన బియ్యంతో సమస్య వచ్చిందని ఉపాధ్యాయులు చెప్పారని, పాఠశాలకు వెళ్లి బియ్యాన్ని పరిశీలిస్తామని ఎంఈఓ చెప్పారు.

ఓం శాంతి పార్కు నిర్మాణానికి భూమిపూజ


బ్రహ్మకుమారీలతో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: శాంతియుత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని 7వ వార్డులో గల మున్సిపల్ స్థలంలో బ్రహ్మకుమారీ సమాజం ఆధ్వర్యంలో నిర్మించనున్న ఓం శాంతి పార్కుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం బ్రహ్మకుమారీ సమాజం ఎంతో కృషిచేస్తోందని వివరించారు. అంతకుముందు మీ కోసం మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి 7వ వార్డులో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం, మార్కెట్ చైర్మన్ కిషన్ నాయక్, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య, కౌన్సిలర్ డాక్టర్ రాముడుయాదవ్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వర విశ్వవిద్యాలయం ఉమ్మడి జిల్లా సంచాలకులు మహాదేవి, మంజుల, విజయలక్ష్మీ, సుజ్ఞానీ తదితరులు పాల్గొన్నారు.

గంగాభవాని కల్యాణమహోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని గంగాభవాని దేవస్థానంలో దేవతామూర్తుల కల్యాణోత్సవం సంప్రదాయపద్ధతిలో వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో పాటు తెలుగు, గంగపుత్ర కులస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమాల్లో తెలుగు, గంగపుత్ర సంఘం నాయకులు పెబ్బేటి కృష్ణయ్య, పెద్దూరి లక్ష్మయ్య, నక్కబిచ్చన్న, వూరి రాముడు, హరికృష్ణ, సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకులు కిషన్‌నాయక్, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, జంబులయ్య, రాములున్నారు.

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటానికి చెందిన విద్యార్థులు భీసం అభిసాగర్, బీసం దయాసాయిలు అండర్–14 క్రికెట్ పోటీలకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ఈ విషయంపై గ్రామ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరై అభినందించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు

మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


గౌతంపల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాగం జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గౌతంపల్లిలో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసిందని తన హయాంలోనే అని, 2001లో ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అలాగే గ్రామంలో ప్రజలకు 70 ఎకరాల సీలింగ్ భూములను ఇచ్చామని, వందకు పైగా ఇళ్లను నిర్మించామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే వంట గ్యాస్ రూ.500కే అందిస్తామని, రుణమాఫీ వంటి పలు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. అంతకుముందు కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, నారాయణగౌడ్, అర్థం రవి, జెడ్పీటీసీ సభ్యులు సుమిత్ర, రోహిణి, వెంకటయ్య గౌడ్, బాలగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పెల్ బీ పోటీలు


క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న శ్రీనునాయక్

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు ఆంగోతు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించడానికి ఇలాంటి పోటీలు దోహదపడుతాయని హెచ్‌ఎం శేఖర్ అన్నారు. 8వ తరగతి విద్యార్థులకు 'జీరో టు హీరో ప్రోగ్రాం', 9వ తరగతి వారికి '100 రోజుల ఆంగ్లం చాలెంజ్ ప్రోగ్రాం' నిర్వహిస్తున్నట్లు ఆంగ్ల బోధకుడు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

అంగన్‌వాడీ విద్యార్థులకు దుస్తులు

బల్మూర్: మండలంలోని లక్ష్మీపల్లి పంచాయతీలోని చెంచుగూడెంలోని అంగన్‌వాడీ చిన్నారులకు ఎస్‌ఐ శివానంధంగౌడ్ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దుస్తులతో పాటు పలకలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన విద్యార్థులను చదువు వైపు ఆకర్షితులను చేయడంలో భాగంగా అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

తెలకపల్లి: మండల పరిధిలోని నక్కలబండ రోడ్డును పీఆర్‌ఏఈ మల్లారెడ్డితో కలిసి ఎంపీపీ కొమ్ము మధు సందర్శించారు. గతంలో రూ.9 లక్షలతో నక్కలబండ రోడ్డుకు కల్వర్టులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మొర్రం పోసి రోడ్డును చదును చేసే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులు త్వరగా నాణ్యతగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు బారిగారి లక్ష్మమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు బారిగారి సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

తాడూరు: మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జీహెచ్‌ఎం తిరుపతయ్య ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు దాతలు అందజేసే సహాయ సహకారాలను ఉపయోగించుకుని లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలో నేటి నుంచి ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శంకరయ్యస్వామి, శివయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు జంగం శివయ్య తెలిపారు. శుక్రవారం శివసంకల్పం, గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, నవగ్రహ కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, 18న శివరాత్రి సందర్భంగా గణపతిపూజ, సర్వదేవత పూజ, పాల పంచామృత అభిషేకాలు, బిల్వార్చన, అలంకరణ, రుద్రహోమం, సాయంత్రం వేళలో ఆరాధన, మహామంగళహారతి, ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం, పూర్ణాహుతి, బలిహరణ, మహానివేదన, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


మన ఊరు -మన బడి పనులను పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని ఆలేరు, పెద్దూరు, గట్టురాయిపాకుల ఉన్నత పాఠశాలలను, ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు వేగవంతంగా నాణ్యతగా చేయాలని, పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని సూచించారు.

విద్యార్థులకు దుస్తులు అందజేత


క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అండగా ఉంటామని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని రఘుపతిపేట, వంగూరు మండలం జాజాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 500 మంది విద్యార్థులకు ట్రస్టు ద్వారా సమకూర్చిన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ఉప్పల ట్రస్టు ద్వార సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని వెల్దండ, తలకొండపల్లి, ఆమనగల్లు, మాడ్గుల్ మండలాల పరిధిలో 10వేల మంది విద్యార్థులకు ఇప్పటివరకు క్రీడా దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మలాశ్రీశైలం, గోపాల్‌నాయక్, చిత్తరంజన్ దాస్, శశికుమార్‌గౌడ్, పూరీ రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పెంచాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ నర్సింగరావు

తెలకపల్లి: ఉపాధి పని పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్‌డీఏ నర్సింగరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామ ఆధీనంలో ఉన్న గాజుల బాలీశ్వరమ్మ పొలంలో కంప చెట్లు, మొద్దులను తొలగించే పనులు జరుగుతున్నాయి. ఈ పనులను డీఆర్‌డీఏ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వందరోజులు పని కల్పించాలని సూచించారు. అలాగే కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించారు. నర్సరీలో వెంటనే షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని, పెంచే ప్రతి మొక్క ఆరోగ్యంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నమ్మతో పాటు సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఏపీఓ మల్లేశ్, టీఏ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి పాల్గొన్నారు.

పరామర్శ



తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లికి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ కార్యకర్త బాల్‌చందర్(45) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కోఆప్షన్ ఎంపీటీసీ ఎండి అబ్దుల్లా, ఉపసర్పంచ్ వెంకటయ్య, రైతు సమన్వయ కమిటీ నాయకులు తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


కర్ణాటక కళాకారుల ప్రదర్శనలు

తాడూరు: మండల కేంద్రంలోని శివాలయ ఆవరణలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటక కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అగ్నిగుండ మహోత్సవం, శివస్వాములు నిర్వహించిన అభిషేకం వివిధ కార్యక్రమాలను పూజారి జంగం శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

వెల్దండ: మండల కేంద్రంలోని బుధార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం శివస్వాములు ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరారు. స్వాములకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చారకొండ: మండలంలోని గోకారంలో గురువారం శివమాలధారణ స్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ బలాజీ సింగ్, జూపల్లి వెంకటయ్య యాదవ్, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా నిర్వహిస్తు శ్రీశైల క్షేత్రానికి బయలు దేరారు. కార్యక్రమంలో శివస్వాములు ఉన్నారు.

మన్ననూర్: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివమాలలు వేసి పాదయాత్రగా వెళ్తున్న శివ స్వాములకు అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ వైద్యసేవలతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ ప్రణతి, నాయకులు సంబు శోభ, బాలమ్మ, అలివేల, సుజాత తదితరులు ఉన్నారు.

రామాలయానికి 'వక్షస్థల' కవచం వితరణ

లింగాల: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయానికి గురువారం వాడకట్టు తిర్పతయ్య, విజయలక్ష్మి దంపతుల రెండవ కుమారుడు సంతోష్, స్వాతి దంపతులు 22 తులాల వెండి 'వక్షస్థల' కవచాన్ని వితరణ చేశారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు రామాచారీ ప్రత్యేక పూజలు జరిపి దాత నుంచి కవచాన్ని తీసుకున్నారు. ఈ కవచం లక్ష్మణ స్వామికి ధరింప చేస్తారని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కల్వకుర్తిరూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరిచిన మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ కోరారు. గురువారం మండలంలోని ఎల్లికల్, గుండూరు, రఘుపతిపేట, మార్చాల, తర్నికల్ ఉన్నత పాఠశాలలతో పాటు పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాల్‌రాజు, రామేశ్వరయ్య, ఎల్లయ్యగౌడ్, ఆంజనేయులు, నెహ్రూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ విజయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో నూతన అభివృద్ధి పనులకు ఎలాంటి భూమి పూజలు, శిలాఫలకాలు వేయరాదన్నారు. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు చేసుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. నూతనంగా ఏర్పాటైన 20 గ్రామ పంచాయతీల భవనల నిర్మాణాల పనులను ప్రారంభించుకోవాలన్నారు. అదే విదంగా సీసీ రోడ్ల పనులను మార్చి 15వ తేది వరకు పూర్తి చేసుకోవాలన్నారు. మండలంలో 7 గ్రామాల్లో పల్లె దవాఖానలు మంజూరు కావడంతో మొదటగా కొట్రలో పనులను ప్రారంభించామన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలోనే మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనులు పూర్తి చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ శాంతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ సునీత, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూపతి రెడ్డి ఉన్నారు.

సైక్, మార్షల్ ఆర్ట్స్‌లో 'గోల్డ్ మెడల్'


సన్మానం పొందుతున్న బాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన 12 ఏళ్ల బాలు సైక్, మార్షల్ ఆర్ట్స్‌లో 8 బంగారు పతకాలను సాధించి అందరి మన్ననలు పొందాడు. పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన కూర అంజి, శారద దంపతుల కుమారుడు బాలు స్థానిక ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. గత మూడేళ్ల నుంచి సైక్, మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొన్న ప్రతి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు హైదరాబాద్, గోవా, జమ్ముకాశ్మీర్, నేపాల్‌లలో సైక్, మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ పొందాడు. ఈ మేరకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన బాలును బుధవారం సన్మానించారు. విద్యార్థి ప్రతిభను గుర్తించి అంతర్జాతీయ సైక్, మార్షల్ ఆర్ట్స్ పోటీల కోసం మలేషియా వెళ్లేందుకు ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అయితే సైక్, మార్షల్ ఆర్ట్స్ పోటీల కోసం శిక్షణను మాస్టర్ రామచందర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందాడు. ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు శశికళ శివశంకర్, రేణుకానాగరాజులు అభినందించారు.

గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం

- వెంకటాంపల్లి పల్లెనిద్రలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంతో పాటు గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వెంకటాంపల్లిలో మంత్రి పల్లెనిద్ర చేశారు. మొదట ఇటీవల ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి, అన్నపూర్ణదేవి, సరస్వతిదేవి, శనేశ్వర స్వామి, జంటనాగులు, వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు ఆలయం దగ్గర అందరికి ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, జిల్లా రైతు సంఘం కో–ఆర్డినేటర్ జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, సర్పంచ్‌లు వెంకటరమణ, దేవేందర్, సతీష్‌కుమార్, పీన్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, విక్రం, నాయకులు పురుషోత్తం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


మేడిపూర్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పునుంతల: కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. గురువారం మండలంలోని దేవదారికుంట తండాలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో దండోరా వేయించడంతోపాటు వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలు శిబిరానికి వచ్చే విధంగా శ్రద్ధ వహించాలని అన్నారు.అనంతరం గ్రామంలో ఏర్పాటుచేసిన వన నర్సరీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు.

తాడూరు: మండలంలోని మేడిపూర్, కుమ్మెరలలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుంది. గురువారం 344 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 31 మందికి అద్దాల పంపిణీ, ఆపరేషన్ నిమిత్తం 15 మందిని గుర్తించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇస్మాయిల్ తెలిపారు. ఈనెల 21 వరకు మేడిపూర్‌లో కంటి వెలుగు పరీక్షా కేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలమ్మ, వైద్య సిబ్బంది శారమ్మ, రమాదేవి, శ్రీనివాసులు, శ్రావణ్‌కుమార్, శారద తదితరులు పాల్గొన్నారు.

రూ.1.5కోట్లతో గ్రంథాలయ బడ్జెట్ ఆమోదం


మాట్లాడుతున్న చైర్మన్ హన్మంత్‌రావు

కందనూలు: జిల్లా గ్రంథాలయ సర్వసభ్య సమావేశం గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చైర్మన్ మాదవరపు హన్మంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23కు గాను రూ.1.5కోట్ల అంచనాతో వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. వీటిలో రూ. కోటితో కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, తెల్కపల్లిలో నూతన భవనాల కోసం కెటాయించగా, పలు భవనాల రిపేర్లకు రూ.2లక్షలు, తాత్కాలిక ఉద్యోగుల జీతాల కోసం రూ.30లక్షలు. బుక్స్ కొనుగోలు కోసం రూ.5లక్షలు, టాయిలెట్స్ ఇతర నిర్వహణ కోసం రూ.2 లక్షలు, ఇతర అవసరాల కోసం మిగిలిన నిధులను వాడుకోనున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, గ్రంథాలయ కార్యదర్శి వెంకటయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివస్వాముల వైద్య శిబిరం

కందనూలు: శివ స్వాములకు ముస్లింలు సేవలందించడం అభినందనీయమని, మత సామరస్యానికి నిదర్శనమని నాగర్‌కర్నూల్ సబ్ జైలు సూపరింటెండెంట్ బి.నాగరాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సవేరా మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం ముగిసిన సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కాలినడకన వెళ్లే శివ స్వాములకు జిల్లా కేంద్రంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వారికి స్వతహాగా సేవలందించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలు, ప్రథమ చికిత్స అందిస్తున్న ఈ సంఘం సభ్యులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అరబ్బీ పాఠశాల కార్యదర్శి సయ్యద్ రఫియొద్దీన్, లాయన్స్ క్లబ్ సభ్యులు శ్రీధర్, సామాజిక కార్యకర్త రాజశేఖర శర్మ, సంఘం కోశాధికారి షర్ఫుద్దీన్, సభ్యులు అష్రఫ్, గౌస్ పాషా, మహమూద్, ముంతాజ్, ఇమ్రాన్, ముస్లిం హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ఎండీ నిజాం పాల్గొన్నారు.